


లైసెన్స్ ఉండాల్సిందే..

లైసెన్స్ తప్పనిసరిగా ఉండాలని యువత భావిస్తుండటంతో ఆర్టీఏ ఆఫీస్‌కు వచ్చే వాహనదారుల సంఖ్య పెరుగుతోంది. 8లో



గరిష్టం / కనిష్టం
37° / 22°

వాతావరణం

జిల్లాలో ఆదివారం మధ్యాహ్నం ఎండ తీవ్రత అధికంగా ఉండే అవకాశం ఉంది. రాత్రివేళ వాతావరణం చల్లబడుతుంది.

న్యూస్‌రీల్

శ్రీసీతారామచంద్రస్వామివారికి సువర్ణ తులసీ అర్చన



నిత్యకల్యాణంలో స్వామివారు

భద్రాచలం: భద్రాచలం శ్రీసీతారామ చంద్ర స్వామివారి దేవస్థానం అంతరాలయంలోని మూలమూర్తులకు శనివారం సువర్ణ తులసీ అర్చన పూజలు చేశారు. తొలుత తెల్లవారు జామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవా కాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం మేళతాళాల నడుమ గర్భ గుడి నుంచి ఊరేగింపుగా తీసుకొచ్చి బేడా మండపంలో కొలువుదీర్చారు. విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం అనంతరం కంకణధారణ, యజ్ఞోపవేత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి కల్యాణం శాస్త్రోక్తంగా జరిపారు. నిత్యకల్యాణంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.


28న రుద్రహోమ పూజలు

పాల్వంచరూరల్: పెద్దమ్మతల్లి ఆలయంలో ఈ నెల 28న రుద్రహోమ పూజలు నిర్వహించనున్నట్లు ఈఓ ఎన్.రజనీకుమారి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని శ్రీకనకదుర్గ (పెద్దమ్మతల్లి) ఆలయంలో శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు యాగశాలలో రుద్రహోమపూజలు నిర్వహించనున్నారు. పూజలో పాల్గొనే భక్తులు రూ.1,516 చెల్లించి గోత్రనామాలను నమోదు చేసుకోవాలని, సంప్రదాయ దుస్తులు మగవారు ధోతి, కండువా, మహిళలు చీరలు ధరించాలని కోరారు. పూర్తి వివరాలకు 63034 08458 నంబరులో సంప్రదించాలని పేర్కొన్నారు.

నేడు ఉమ్మడి జిల్లాలో మంత్రి పొంగులేటి పర్యటన

ఖమ్మంవన్‌టౌన్: రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదివారం ఉమ్మడి జిల్లాలో పర్యటించనున్నారు. ఉదయం 10–30 గంటలకు ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని పలు ప్రాంతాల్లో బీటీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారు. ఆ తర్వాత తిరుపతమ్మతల్లి ఆలయంలో పూజలు చేయనున్న మంత్రి మధ్యాహ్నం 2–30 గంటలకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చుంచుపల్లి మండలం విద్యానగర్ కాలనీ మీదుగా భద్రాచలం చేరుకుంటారు. అక్కడ ఏఎంసీ కాలనీలో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల లబ్ధిదారులకు పట్టాలు పంపిణీ చేస్తారు. సాయంత్రం 4–30 గంటలకు భద్రాచలంలోని మనుబోతుల చెరువు వద్ద తడి, పొడి చెత్త కలెక్షన్ సెంటర్‌ను ప్రారంభించాక, సాయంత్రం 5–45 గంటలకు కొత్తగూడెంలోని ఆఫీసర్స్ క్లబ్‌లో జరిగే ఇఫ్తార్‌విందులో పాల్గొంటారు.

తగ్గుతున్న కిన్నెరసాని నీటిమట్టం



కిన్నెరసాని జలాశయం నీటిమట్టం సూచిక

పాల్వంచరూరల్: వేసవి ఎండలు మండుతుండటంతో కిన్నెరసాని జలాశయంలో నీటిమట్టం క్రమక్రమంగా తగ్గుతోంది. 407 అడుగుల నీటి నిల్వ సామర్థ్యం కలిగిన రిజర్వాయర్‌లో ఈ నెల 22న (శనివారం) 398.60 అడుగులకు చేరింది. గతేడాది ఇదే రోజు 399.60 అడుగులు నమోదైంది. గతేడాదికంటే అడుగు మేర నీటిమట్టం తగ్గిందని డ్యామ్‌సైడ్ ఇంజనీర్ తెలిపారు. రిజర్వాయర్ నుంచి రోజూ 100 క్యూసెక్కుల జలాలను కేటీపీఎస్, నవభారత్, ఎన్ఎండీసీ కర్మాగారాలకు, కొత్తగూడెం, పాల్వంచ మున్సిపాలిటీలకు సరఫరా చేస్తున్నట్లు పేర్కొన్నారు.

రెండో రోజు ప్రశాంతంగా పరీక్షలు



హాల్ టికెట్‌ను పరిశీలిస్తున్న సిబ్బంది

కొత్తగూడెంఅర్బన్: పదో తరగతి పరీక్షలు రెండో రోజు శనివారం ప్రశాంతంగా జరిగాయి. జిల్లాలో సెకండ్ లాంగ్వేజ్ హిందీ పరీక్ష ప్రశాంతంగా జరిగిందని డీఈఓ ఎం.వెంకటేశ్వరాచారి తెలిపారు. పరీక్షకు రెగ్యులర్ విద్యార్థులు 12,227 మందికి గాను 12195 మంది హాజరయ్యారని, 32 మంది గైర్హాజరయ్యారని పేర్కొన్నారు. డీఈఓ, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు పల కేంద్రాల్లో తనిఖీలు చేశారు.

స్మార్ట్ రామయ్య!



భద్రాచలం టెంపుల్ ఇన్‌ఫర్మేషన్ (బీటీఐ) యాప్ సిద్ధమైంది. సుదూర ప్రాంతాల భక్తులు, యువతకు అరచేతిలో సమస్త సమాచారం అందించేలా రామాలయ ఈఓ ఎల్.రమాదేవి ఆధ్వర్యంలో ఆత్రేయ ఇన్ఫోటెక్ సిస్టం కంపెనీ అన్ని వివరాలతో రూపొందించింది. ఆండ్రాయిడ్ స్మార్ట్ ఫోన్‌లకు ప్లే స్టోర్‌లో ఈ యాప్ లభ్యమవుతుండగా, బార్ కోడ్ స్కాన్ ద్వారా సైతం డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఇప్పటికే వినియోగంలోకి తెచ్చినా శ్రీరామ నవమి నాటికి అధికారికంగా ప్రారంభించనున్నారు. ఇటీవల భద్రాచలం పర్యటనకు వచ్చిన కలెక్టర్ జితేష్ వి.పాటిల్ యాప్ గురించి తెలుసుకుని ఆలయ అధికారులను ప్రశంసించారు. సుదూర ప్రాంతాల భక్తులు సేవలు పొందటం సులభతరమవుతుందని పేర్కొన్నారు. – భద్రాచలం

'బీటీఐ' యాప్‌లో రామాలయ సమస్త సమాచారం

- భక్తులకు అందుబాటులోకి తెచ్చిన ఆలయ అధికారులు
- శ్రీసీతారామ చంద్రస్వామివారి పూజలు, సేవల వివరాలు లభ్యం
- ఉపాలయాల వివరాలు, మార్గాలు కూడా అనుసంధానం
- ఆలయ అధికారులను అభినందించిన కలెక్టర్ జితేష్ వి.పాటిల్

22 రకాల సేవలు..

ఆండ్రాయిడ్ ఫోన్లలో ప్లే స్టోర్‌లో భద్రాచలం టెంపుల్ ఇన్ఫర్మేషన్ అని టైపు చేయగానే యాప్ డిస్‌ప్లే అవుతుంది. ఇన్‌స్టాల్ చేసుకుని ఓపెన్ చేస్తే శ్రీ సీతారామ చంద్రస్వామివారి దేవస్థానం పేరుతో మూలమూర్తుల ఫొటోతో పేజీ దర్శనమిస్తుంది. ఆలయ చరిత్ర ఆంగ్లంలో కనిపిస్తుంది. కింద కనిపించే సేవ అండ్ టైమింగ్స్ ఆప్షన్ క్లిక్ చేస్తే ఆన్‌లైన్ బుకింగ్ జాబితా పేరుతో ఆలయంలో నిత్యం అందే సేవలు, వేళల వివరాలు దర్శనమిస్తాయి. దేవస్థానంలో లభించే 22 రకాల సేవల వివరాలు పొందవచ్చు. ఇదే పేజీలో ఆలయం అందిస్తున్న సర్వీసులను, భక్తులు చేరుకునేందుకు గూగుల్ మ్యాప్‌ను అనుసంధానం చేశారు. భద్రాచలంలో ఉన్న అన్నదానం, కల్యాణ కట్ట, లడ్డూ కౌంటర్, పురుషోత్తపట్నం, ఆలయం వద్ద ఉన్న గోశాలలు, రామదాసు ధ్యాన మందిరం, ఆర్టీసీ బస్టాండ్, ఘాట్, ఎమర్జెన్సీ, ప్రచార రథం, ఇన్‌ఫర్మేషన్ సెంటర్ (సీఆర్ఓ) శ్రీ సీతారామ కల్యాణ మండపం, పర్ణశాలలో పర్ణశాల, నార చీరల ప్రాంతాలు, నేలకొండపల్లి, కొత్తగూడెం రైల్వే స్టేషన్ వివరాలను పొందుపర్చారు. ఇదే పేజీలో ఎటపాకలో ఉన్న జటాయువు మండపం, భద్రాచలంలో ఉన్న ట్రైబల్ మ్యూజియం, అభయాంజనేయస్వామి ఆలయం, ఏపీలోని పాపికొండలు, శ్రీరామగిరి వెళ్లే మార్గాల మ్యాప్‌లను అనుసంధానం చేశారు.

ఉపాలయాలు వివరాలు కూడా..

మరో పేజీలో శ్రీ సీతారాముల రామాయణ ఇతివృత్తాన్ని తెలుగులో ఉంచారు. ఆ తర్వాత ఉపాలయాల వివరాలను అందుబాటులో ఉంచారు. ఈ పేజీలో భద్రాచలంలో రామాలయానికి అనుబంధంగా ఉన్న నర్సింహస్వామి ఆలయం, శివాలయం, తాతగుడి సెంటర్‌లో ఉన్న గోవిందరాజ స్వామి ఆలయం, రంగనాయకుల గుట్ట మీద ఉన్న రంగనాథ స్వామి ఆలయం, పర్ణశాలలో ఉన్న పర్ణశాల ఆలయం, నేలకొండపల్లిలో ఉన్న బుద్ధవనం, భక్తరామదాసు మందిరం వివరాలను పొందుపర్చారు. ఇలా మొత్తంగా భద్రాచలం రామాలయం, పర్యాటక, భక్తి ప్రాంతాల వివరాలను యాప్‌లో అందుబాటులో ఉంచారు. ఇవే కాకుండా ఇతర సేవలను సైతం భక్తులకు మరింత చేరువ చేసేలా యాప్‌లో మెరుగులు దిద్దుతున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు.

భూగర్భ జలాలు పెంచుకోవాలి

- ఇంకుడు, నీటి గుంతలు నిర్మించాలి
- ప్రపంచ నీటి దినోత్సవంలో కలెక్టర్ జితేష్ వి.పాటిల్



జగన్నాథపురంలో నీటిగుంత తవ్వుతున్న కలెక్టర్ జితేష్ వి.పాటిల్

పాల్వంచరూరల్: భూగర్భజలాల పెంపు కోసం ప్రతి ఒక్కరూ పాటుపడాలని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ సూచించారు. ప్రపంచ నీటి దినోత్సవం సందర్భంగా మండల పరిధిలోని జగన్నాథపురం గ్రామ రైతు వేదికలో శనివారం జరిగిన అవగాహన సదస్సులో మాట్లాడారు. ఇంట్లో ఇంకుడు గుంతలు, పంట పొలాల్లో ఫారం పాండ్లు నిర్మించుకుంటే భూగర్భజలాలు పెరుగుతాయన్నారు. యాసంగిలో ఆరుతడి పంటలు సాగు చేసుకోవాలని చెప్పారు. నీటిని పొదుపుగా వినియోగించుకోవాలని, వివిధ వనరులకు ప్రత్యామ్నాయాలు ఉన్నాయని, నీటి వనరుకు మాత్రం ప్రత్యామ్నాయం లేదని వివరించారు. ఇంటి ఆవరణలో, ఉద్యాన వనాల్లో, రహదారుల పక్కన మ్యాజిక్ సోక్ పిట్స్ నిర్మించాలని సూచించారు. రైతులు మునగ సాగుకు ముందుకు రావాలన్నారు. విరివిగా చెట్లను పెంచి పర్యావరణాన్ని రక్షించాలన్నారు. నివాసాల్లో తీసుకుంటున్న మ్యాజిక్ సోక్ పిట్ పనులను పరిశీలించి, వారితోపాటు కలిసి పనిచేశారు. మూడు రోజుల్లో పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ఒక్కో సోక్ పిట్ కోసం ప్రభుత్వం రూ.6,800 చెల్లిస్తోందని తెలిపారు. అదనపు కలెక్టర్ విద్యాచందన, డీఈఏ బాబూరావు మాట్లాడుతూ నీటి వినియోగంపై అంతరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. రీచార్జి గుంతలు, సేద్యపు గుంతలు, కందకాలను నిర్మాణంచేసుకోవాలని, ఇంటిపైకప్పు, రోడ్డుపై పడిన వర్షపు నీటిని రీచార్జి గుంతల ద్వారా కందకాలకు మళ్లించుకోవాలని సూచించారు.

ఉపాధి పనులకు హాజరు కావాలి

సూపర్‌బజార్(కొత్తగూడెం): జిల్లా వ్యాప్తంగా ఉపాధిహామీ పథకం పనులు కోరే ప్రతీ ఒక్కరు హాజరు కావాలని కలెక్టర్ జితేష్ వి. పాటిల్ అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో జిల్లాలో పెద్దఎత్తున పనులు చేపడుతున్నట్లు తెలిపారు. ఆర్థిక సంవత్సరం ముగుస్తున్నందున ఈ నెల 29వ తేదీ వరకు వారం రోజులు వేగవంతంగా పనులు పూర్తి చేయాలన్నారు. బోరు ఆధారిత వ్యవసాయ భూముల్లో రైతులు ఫారం పాండ్స్ నిర్మించుకోవాలన్నారు.

బైక్‌పై వెళ్లి.. పలుగుతో గుంత తవ్వి..

పాల్వంచ మండలం తోగ్గూడెంలో ఉపాధి పనులను కలెక్టర్ జితేష్ పరిశీలించారు. తోగ్గూడెం ప్రధాన రహదారి మీదుగా ఉపాధి పనులు నిర్వహించే ప్రదేశానికి వాహనాలు వెళ్లే అవకాశంలేదు. దీంతో కలెక్టర్ కారును పక్కన పెట్టి సిబ్బంది ద్విచక్రవాహనంపై కూర్చుని సుమారు రెండు కిలోమీటర్లు ప్రయాణించి ఉపాధి పని ప్రదేశానికి వెళ్లారు. ఉపాధి కూలీలతో మాట్లాడారు. పలుగు(గడ్డపార) చేత పట్టి నీటిగుంతను తవ్వి కొద్దిసేపు పనిచేశారు. తవ్వకం పనులు అంత సులువు కాదని, నిత్యం పనిచేసేవారికే స్కిల్స్ ఉంటాయని, వారే సులువుగా గుంతలు తవ్వగలరని పేర్కొన్నారు. అదనపు కలెక్టర్ విద్యాచందన, డీఏఓ బాబూరావు కూడా పలుగు పట్టి గుంత తవ్వారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు, జిల్లా భూగర్భజల అధికారి రమేష్, జిల్లా పంచాయతీ అధికారి చంద్రమౌళి, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ తిరుమలేశ్, తహసీల్దార్ వివేక్, ఎంపీడీఓ కె.విజయభాస్కరరెడ్డి, ఎయిడ్ ఎస్ జీఓ హరిప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

జీవనోపాధి పెంపొందించుకోవాలి

ఐటీడీఏ పీఓ రాహుల్



వాహన తాళాలను లబ్ధిదారులకు అందజేస్తున్న పీఓ రాహుల్


భద్రాచలం: ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకుని గిరిజన యువత జీవనోపాధిని పెంపొందించుకోవాలని ఐటీడీఏ పీఓ బి.రాహుల్ సూచించారు. భద్రాచలం ఐటీడీఏ ప్రాంగణంలోని శ్రీ జయ దుర్గ సహిత పంచముఖ విశ్వేశ్వర స్వామి దేవాలయం ఎదురుగా నెలకొల్పిన శ్రీ దుర్గా భవాని సెంట్రింగ్, బ్రిక్స్ యూనిట్‌ను శనివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. రూ.25 లక్షల వ్యయంలో రూ.15 లక్షల సబ్సిడీతో ఏర్పాటు చేసుకున్న యూనిట్ అందరూ కలిసికట్టుగా అభివృద్ధి చేసుకోవాలన్నారు. మార్కెటింగ్ పెంచుకుని, బ్యాంకు రుణం ప్రతినెలా చెల్లించాలని సూచించారు. అనంతరం యంత్రాలు, సామగ్రిని పరిశీలించారు. ఇటుకలు రవాణా చేసే వాహనాన్ని ప్రారంభించారు. ఆ తర్వాత వాహన తాళాలు లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ డేవిడ్ రాజ్, అశోక్ కుమార్, హరికృష్ణ, యూనిట్ సభ్యులు రాజు, వెంకటమ్మ, మహేశ్వరి, వెంకటమ్మ, నాగరాజు, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

అర్థమయ్యే రీతిలో బోధించాలి

దుమ్ముగూడెం : విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో పాఠాలు బోధించాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి.రాహుల్ అన్నారు. శనివారం మండలంలోని జిన్నెలగూడెం జీపీఎస్ పాఠశాలలో ఆకస్మికంగా తనిఖీ చేశారు. 3,5 తరగతి విద్యార్థినుల సామర్థ్యాన్ని పరీక్షించారు. పిల్లలతో బోర్డుపై రాయించి పరిశీలించారు. అనంతరం గణిత శాస్త్రం అంటే పిల్లల్లో భయం పోగొట్టాలని ఉపాధ్యాయులకు సూచించారు. పాఠశాలలో చదువుతున్న పిల్లలు ఉద్దీపకం వర్క్ బుక్ లోని సారాంశాలు పూర్తిస్థాయిలో అర్థం చేసుకున్నారని అన్నారు. ఏటీడీఓ అశోక్ కుమార్ పాల్గొన్నారు.

లక్ష్య సాధనకు సమష్టిగా కృషి చేయాలి

సింగరేణి డైరెక్టర్ వెంకటేశ్వర్లు



వ్యూ పాయింట్ నుంచి బొగ్గు ఉత్పత్తిని పరిశీలిస్తున్న డైరెక్టర్ వెంకటేశ్వర్లు తదితరులు

మణుగూరు టౌన్: బొగ్గు ఉత్పత్తి లక్ష్య సాధనకు సమష్టిగా కృషి చేయాలని సింగరేణి డైరెక్టర్(పీపీ, పా) కొప్పుల వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం మణుగూరులో పర్యటించిన ఆయన ఏరియా జీఎం దుర్గం రాంచందర్‌తో కలిసి వ్యూ పాయింట్ నుంచి ఓసీ–2లో బొగ్గు వెలికితీతను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ 2024–25 ఆర్థిక సంవత్సరంలో ఈ నెల 22 నాటికి 100 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధించడం అభినందనీయమని అన్నారు. యూనియన్ల నాయకులు, అధికారులు, కార్మికుల కృషి ప్రశంసనీయమని పేర్కొన్నారు. ఇదే స్ఫూర్తి కొనసాగించాలని సూచించారు. తొలుత జీఎం కార్యాలయంలో డైరెక్టర్‌కు ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో అధికారులు శ్యాంసుందర్, ఆర్.శ్రీనివాస్, వీరభద్రరావు, లక్ష్మీపతిగౌడ్, శ్రీనివాసాచారి, రమేశ్, అనురాధ, మదన్ నాయక్, శ్రీనివాసమూర్తి, వీరభద్రుడు, బైరెడ్డి వెంకటేశ్వర్లు, కె.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

25ఏళ్లపాటు విద్యుత్ కొనుగోలు చేస్తాం..

సౌరప్లాంట్లపై అవగాహన సదస్సులో ఎన్పీడీసీఎల్ సీఎండీ



సదస్సులో పాల్గొన్న అధికారులు

ఖమ్మంవ్యవసాయం: ఆసక్తి ఉన్న రైతులు పంట పొలాల్లో సౌర విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం పునరుత్పాదక శక్తి, నవీన శక్తి మంత్రిత్వ శాఖ ద్వారా పీఎం కుసుమ్ పథకాన్ని రూపొందించిందని ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి వెల్లడించారు. ఈ ప్లాంట్ల ద్వారా రైతులు ఉత్పత్తి చేసే విద్యుత్‌ను 25ఏళ్ల పాటు సంస్థలు కొనుగోలు చేస్తూ యూనిట్‌కు రూ.3.13 చెల్లిస్తాయని తెలిపారు. జిల్లాలో సౌరప్లాంట్లకు దరఖాస్తు చేసుకున్న 80 మంది రైతులకు ఖమ్మంలో శనివారం అవగాహన సదస్సు ఏర్పాటుచేశారు. ఈ సదస్సులో అదనపు కలెక్టర్ శ్రీజ, లీడ్ బ్యాంక్ మేనేజర్ శ్రీనివాసరెడ్డి, ఖమ్మం ఎస్ఈ ఇనుగుర్తి శ్రీనివాసాచారి, టీజీ రెడ్‌కో మేనేజర్ పి.అజయ్‌కుమార్ పాల్గొనగా.. హనుమకొండ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సీఎండీ వరుణ్‌రెడ్డి మాట్లాడుతూ సౌర ప్లాంట్ల ఏర్పాటుతో లాభాలను వివరించారు. 500 కిలోవాట్ల నుంచి 2 మెగావాట్ల సామర్థ్యం కలిగిన ప్లాంట్లు ఏర్పాటు చేసుకోవచ్చని తెలిపారు. వ్యక్తిగతంగా లేక సమూహాలుగా ఏర్పాటుచేసుకునే అవకాశముండగా, 33/11 కేవీ సబ్ స్టేషన్లకు ఐదు కిలోమీటర్ల దూరాన స్థలం ఉండాలని చెప్పారు.

ఉగాదికైనా వేతనాలిస్తారా..?

- మూడు నెలలుగా జీతాలు రాక పంచాయతీ కార్మికుల అవస్థ
- ఉన్నతాధికారులకు విన్నవించినా పట్టించుకోవడంలేదని ఆవేదన



వీధుల్లో చెత్త సేకరిస్తున్న పంచాయతీ కార్మికులు

చుంచుపల్లి: పారిశుద్ధ్య పనులు చేపడుతూ పల్లెను పరిశుభ్రంగా ఉంచే పంచాయతీ కార్మికులకు మూడు నెలలుగా వేతనాలు అందడంలేదు. జనవరి నుంచి జీతాలు రాకపోవడంతో కుటుంబాలు ఆర్థికంగా అవస్థ పడుతున్నాయి. ఏడాది కాలంగా పంచాయతీలకు సర్పంచులు లేరు. పంచాయతీ కార్యదర్శులు, ప్రత్యేకాధికారులు బాధ్యతలు నిర్వహిస్తున్నా పారిశుద్ధ్య కార్మికుల సమస్యలను పట్టించుకోవడం లేదు. రాష్ట్ర ఆర్థిక సంఘం నిధులు, కేంద్ర ప్రభుత్వ నిధులు సకాలంలో రాక వీరి వేతనాల చెల్లింపులో జాప్యం జరుగుతోంది.

ఉమ్మడి జిల్లాలో 4,492 మంది కార్మికులు

ఉమ్మడి జిల్లాలోని 1,070 గ్రామ పంచాయతీల పరిధిలో 4,252 మంది పారిశుద్ధ్య కార్మికులు (ఎంపీడబ్ల్యూ) విధులు నిర్వర్తిస్తున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని 481 గ్రామపంచాయతీల్లో 2,129 మంది, ఖమ్మం జిల్లాలోని 589 గ్రామపంచాయతీల్లో 2,363 మంది పనిచేస్తున్నారు. మల్టీపర్పస్ వర్కర్లుగా పేర్కొంటున్న వీరిని స్థానిక అవసరాలకు అనుగుణంగా వివిధ రకాల పనులకు వినియోగించుకుంటున్నారు. వాటర్‌మెన్, పారిశుద్ధ్య కార్మికులు, ట్రాక్టర్ డ్రైవర్, కారోబార్, పంపు ఆపరేటర్, ఎలక్ట్రీషియన్ విధులు నిర్వర్తింజేస్తున్నారు. జీఓ నంబర్ 51 ప్రకారం ఒక్కో కార్మికుడికి నెలకు రూ.9,500 చొప్పున ఆన్‌లైన్ ద్వారా వేతనం చెల్లిస్తారు. ఇక అత్యవసర పరిస్థితుల్లో తాత్కాలికంగా నియమించుకునే వారికి నెలకు రూ.5 వేలు ఇస్తారు. మేజర్ గ్రామ పంచాయతీల్లో 12 నుంచి 15 మంది వరకు, చిన్న పంచాయతీల్లో ఎనిమిది మంది వరకు వీరు ఉన్నారు. పారిశుద్ధ్య పనులు, హరిత హారం, పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలల పరిశుభ్రత, ఇంటింటికీ ట్రాక్టరు ద్వారా చెత్త సేకరణ, విద్యుద్దీపాల నిర్వహణ, డంపింగ్ యార్డుల్లో కంపోస్ట్ ఎరువు తయారీ, తాగునీటి సరఫరా తదితర విభాగాల్లో పనిచేస్తున్నారు. పలుమార్లు వేతన సమస్యను ఉన్నతాధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ నెల 30న ఉగాది పండుగ లోపైనా వేతనాలు చెల్లించాలని కోరుతున్నారు.

ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారు



జనవరి నుంచి వేతనాలు రాకపోవడంతో కార్మిక కుటుంబాలు అప్పుల పాలవుతున్నాయి. జిల్లా అధికారులను అడిగితే త్వరలో వస్తాయంటున్నారు. కనీసం ఉగాది పండుగ లోపైనా వేతనాలు విడుదల చేయాలి.

–డి.అమర్‌నాథ్, జీపీ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) జిల్లా అధ్యక్షుడు

త్వరలో విడుదలకు అవకాశం



పారిశుద్ధ్య కార్మికులకు జనవరి నుంచి వేతనాలు చెల్లించాల్సి ఉంది. పెండింగ్ జీతాల విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం. వీరికి త్వరలోనే వేతనాలు విడుదలయ్యే అవకాశం ఉంది.

– వి.చంద్రమౌళి, డీపీఓ, భద్రాద్రి కొత్తగూడెం

వ్యక్తిత్వ వికాస శిక్షణ నిపుణుడిగా శాంతికుమార్



సర్టిఫికెట్ అందుకుంటున్న శాంతికుమార్

మణుగూరు రూరల్: వ్యక్తిత్వ వికాస శిక్షణ నిపుణుడిగా మణుగూరు ప్రాంతానికి చెందిన పప్పుల శాంతికుమార్ ఎంపికయ్యాడు. ఆయన ఇప్పటికే మాదక ద్రవ్యాల వినియోగంతో కలిగే అనర్థాలపై అవగాహనకు శిక్షణ పొందగా, ప్రభుత్వ విద్యాసంస్థల్లో వ్యక్తిత్వ వికాస తరగతులు నిర్వహించారు. ఈ నేపథ్యాన ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ సంస్థ మాదకద్రవ్యాల వినియోగంతో అనర్థాలు, అరికట్టడంపై ఇచ్చిన శిక్షణకు రాష్ట్రం నుంచి వంద మంది ఎంపికవగా శాంతికుమార్‌కు జాబితాలో చోటు దక్కింది. ఇటీవల శిక్షణ పూర్తయిన అనంతరం హైదరాబాద్‌లో తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో డైరెక్టర్ సందీప్ శాండిల్య, ఇతర అధికారుల చేతుల మీదుగా సర్టిఫికెట్ అందుకున్నారు.

క్లుప్తంగా

'గేట్'లో ర్యాంక్ సాధించడంపై హర్షం



దీపికను అభినందిస్తున్న భరత్‌కృష్ణ

పాల్వంచ: జాతీయస్థాయిలో నిర్వహించిన గేట్–2025 కాంపిటేటివ్ పరీక్షలో స్థానిక అను బోస్ మైనింగ్ ఇంజనీరింగ్ కళాశాలలో (మైనింగ్) ఫైనల్ ఇయర్ చదువుతున్న టి.దీపిక ఆల్ ఇండియాలో 602 ర్యాంక్ సాధించింది. శనివారం కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కళాశాల చైర్మన్ టి.భరత్‌కృష్ణ, సెక్రటరీ డాక్టర్ ఎ.అవని దీపికను అభినందించారు. కార్యక్రమంలో కళాశాల అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ ఎస్‌వీ సుబ్బారావు, ప్రిన్సిపాల్ బి.రవి, వైస్ ప్రిన్సిపాల్ జి.వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

జమిలీ ఎన్నికలు చారిత్రక అవసరం



మాట్లాడుతున్న బైరెడ్డి ప్రభాకర్‌రెడ్డి

పాల్వంచరూరల్: జమిలీ ఎన్నికలు జరపడం ఈ దేశానికి చారిత్రక అవసరమని బీజేపీ జిల్లా అధ్యక్షుడు బైరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. స్థానిక అంబేడ్కర్ సెంటర్‌లో బీజేపీ ఆధ్వర్యంలో శనివారం 'వన్ నేషన్.. వన్ ఎలక్షన్.. బీజేపీ దృష్టి కోణం' అంశంపై వర్క్‌షాప్ నిర్వహించగా బైరెడ్డి మాట్లాడారు. ఒకేసారి ఎన్నికలు నిర్వహించడం వల్ల ప్రజాధనం ఆదా అవుతుందని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా మాజీ అధ్యక్షుడు రంగాకిరణ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జంపన సీతారామరాజుతోపాటు చింతలచెరువు శ్రీనివాసరావు, రాపాక రమేశ్, కుంజా ధర్మ, బాలునాయక్, పైడిపాటి రవీందర్, గొడుగు శ్రీధర్, చందు, జల్లారపు శ్రీనివాస్, పసుమర్తి సతీశ్, పున్నం భిక్షపతి పాల్గొన్నారు.

పర్ణశాల వేలం పాటలు ఖరారు



వేలం పాట నిర్వహిస్తున్న అధికారులు

దుమ్ముగూడెం: పర్ణశాల గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో పార్కింగ్, బోట్ షికారు, మరుగుదొడ్ల నిర్వహణకు శనివారం వేలంపాట నిర్వహించారు. ఎంపీఓ, పంచాయతీ ప్రత్యేకాధికారి బద్ది రామకృష్ణ, పంచాయతీ కార్యదర్శి సంపతి శ్రీనివాసరావు సమక్షంలో తొలుత బోట్ షికారు వేలం పాట నిర్వహించారు. గోవిందాపురం గ్రామానికి చెందిన తెల్లం భీమరాజు రూ.44,40,000కు దక్కించుకున్నాడు. గతేడాది ఇది రూ.42,40,000కు దక్కగా.. ఈ ఏడాది రూ.2 లక్షలు లాభం వచ్చింది. వాహన పార్కింగ్ పాటను పొడియం వెంకటరమణ రూ.61లక్షలకు దక్కించుకున్నాడు. గతేడాది పార్కింగ్ రూ.40లక్షలకు దక్కగా ఈ ఏడాది రూ.21 లక్షలు అదనంగా వచ్చాయి. మరుగుదొడ్ల నిర్వహణ పాటను జానకీరామ్ రూ.85 వేలకు దక్కించుకున్నాడు. గతేడాది రూ.1లక్ష 5 వేలకు వెళ్లింది. వేలం పాటలతో పంచాయతీకి రూ.1,06,25,000 ఆదాయం సమకూరినట్లు అధికారులు తెలిపారు.

పెరుగుతున్న మలేరియా కేసులు



పరీక్షిస్తున్న వైద్యుడు

భద్రాచలంఅర్బన్: భద్రాచలం ప్రభుత్వ ఆస్పత్రిలో 20 రోజులుగా మలేరియాతో బాధపడుతూ చేరుతున్న వారి సంఖ్య పెరుగుతూ ఉంది. అందులో అందరూ చిన్నారులుండటంతో వైద్యులు అప్రమత్తమయ్యారు. ఇప్పటికే 25 మంది చిన్నారులు చికిత్స పొందుతుండగా, 42 మంది ఇతర జ్వరాలతో చేరారు. మలేరియా బాధితుల్లో చిన్నారులే అధికంగా ఉండటంతో వైద్యులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఆస్పత్రిలో చికిత్స కోసం వచ్చినవారిలో 4 శాతం రక్తం ఉండటం లేదా, ప్లేట్‌లెట్ల సంఖ్య 20 వేల నుంచి 30 వేలకు పడిపోయిన తరువాత ఆస్పత్రికి వచ్చినట్లు వైద్యులు తెలిపారు. దీంతో ఐదు రోజులపాటు వైద్యం అందించి, ఇంటికి పంపిస్తున్నామని వారు చెప్పారు. ఇదే వైద్యానికి ప్రైవేట్ ఆస్పత్రుల్లో రూ.30 వేల వరకు ఖర్చు అవుతోందని సమాచారం. సకాలంలో రోగాన్ని గుర్తించి ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించి చిన్నారుల ప్రాణాల కాపాడుకోవాలని వైద్యాధికారులు సూచిస్తున్నారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.20,871

లైసెన్స్ ఉండాల్సిందే..

- ప్రజల్లో పెరుగుతున్న అవగాహన..
- అవసరాన్ని గుర్తించి లైసెన్స్‌కు క్యూ కడుతున్న యువత
- మూడేళ్లలో 36,243 మందికి డ్రైవింగ్ లైసెన్స్
- పోలీసులు, ఆర్టీఏ అధికారుల చొరవ



కొత్తగూడెం రవాణాశాఖ కార్యాలయంలో లైసెన్స్ కోసం క్యూలో ఉన్న యువకులు

కొత్తగూడెంటౌన్: లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపితే శిక్షార్హులు.. రోడ్డెక్కి వాహనం నడపాలి అంటే లైసెన్స్ తప్పనిసరి కలిగి ఉండాలి.. అనే నినాదాలు పనిచేస్తున్నాయి. గతంలో ఎలా ఉన్నా ఇప్పుడు యువతలో మార్పు కనిపిస్తోంది. లైసెన్స్ తీసుకుని వాహనాలు నడపాలని యువత భావిస్తున్నట్లు స్పష్టంగా తెలుస్తోంది. దీంతో లైసెన్స్ కోసం వచ్చేవారి సంఖ్య క్రమంగా పెరుగుతోంది. రోజూ ఎక్కడో ఓ చోట ప్రమాదం జరుగుతుండడం, లైసెన్స్ లేకుంటే పడే శిక్ష తీవ్రత ఎక్కువగా ఉండటం.. ప్రమాదంతోపాటు లైసెన్స్ లేకుంటే ఇంకా ఎక్కువ నష్టం జరుగుతుండటంతోపాటు ఆర్టీఏ అధికారులు, పోలీసులు అవగాహన కల్పిస్తుండటంతో యువతతో పాటు అన్ని వర్గాల్లో కదలిక వచ్చినట్లయిందని అధికారులు చెబుతున్నారు.

2 లక్షలకు పైగానే వాహనాలు

జిల్లావ్యాప్తంగా దాదాపు 2,02,811 టూ, త్రీ, ఫోర్ వీలర్లు (వాహనాలు) ఉన్నాయి. 18 ఏళ్లు దాటిన ప్రతి ఒక్కరూ వాహనం నడపాలంటే తప్పని సరిగా లైసెన్స్ తీసుకోవాలనే నిబంధన ఉంది. అంతకంటే తక్కువ వయస్సు ఉన్నవారు అసలు వాహనం నడపడానికి అర్హులుకారనే విషయం తెలిసిందే. కాగా, మూడేళ్లలో పోలీస్ అధికారులు, జిల్లా రవాణా శాఖాధికారులు, ట్రాఫిక్ పోలీసులు.. వాహనదారులు లైసెన్స్ కలిగి ఉండాలని, లైసెన్స్ లేకపోతే ఎలాంటి పరిణామాలు ఎదురవుతాయనే అంశంపై అవగాహన కల్పిస్తున్నారు. దీంతో వాహనదారుల్లో మార్పు వచ్చిందని, రోజూ ఆర్టీఏ కార్యాలయానికి లైసెన్స్‌ల కోసం వస్తున్న వారి సంఖ్య పెరుగుతోందని అధికారులు చెబుతున్నారు. జిల్లావ్యాప్తంగా మూడేళ్లలో దాదాపు 36,243 మంది డ్రైవింగ్ లైసెన్స్ పొందారు. ఇటీవల ట్రాఫిక్ ఎస్‌ఐ నరేశ్.. లైసెన్స్ లేకుండా వాహనాలను నడుపుతున్న వారిని ఆర్టీఏ కార్యాలయానికి తీసుకువెళ్లి, లైసెన్స్‌కు దరఖాస్తు చేసుకునేలా అవగాహన కల్పించారు. డ్రైవింగ్ లైసెన్స్ కావాలంటే 18 ఏళ్ల వయస్సు దాటిన ప్రతి ఒక్కరూ ఆన్‌లైన్‌లో స్లాట్ బుక్ చేసుకుని దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఆ తర్వాత లెర్నింగ్ లైసెన్స్ కోసం ఆర్టీఏ కార్యాలయానికి వెళ్లాలి. అక్కడ ట్రాఫిక్ సంబంధించి లైసెన్స్ (మొదట లెర్నింగ్ లైసెన్సను) టెస్టును నిర్వహించి కేటాయిస్తారు. ఇది పూర్తి అయిన తరువాత ఆరునెలల కాలంలో మరోసారి ఆన్‌లైన్‌లో స్లాట్ బుక్ చేసుకుని, ఆర్టీఏ కార్యాలయానికి వెళ్తే పర్మనెంట్ లైసెన్స్ ఇస్తారు.

జిల్లాలో లైసెన్సుల జారీ వివరాలు

కేటగిరీ	31-12-2022	2023	2024	2025 వరకు(ఇప్పటివరకు)
హెవీ మోటార్ వెహికల్స్	252	291	269	49
మీడియం మోటార్ వెహికల్స్	0	0	0	0
లైట్ మోటార్ వెహికల్స్	3,531	4,420	258	950
మోటార్ సైకిల్, స్కూటర్, మోపెడ్స్	4,351	5,189	5,336	926
ట్రాక్టర్స్	564	668	728	148
ఇతర కేటగిరి వాహనాలు	763	1,082	1,269	199
మొత్తం	9,461	11,650	12,860	2,272

వాహనదారులకు లైసెన్స్ ఉండాల్సిందే..



జిల్లావ్యాప్తంగా సుమారు 2,02,811 టూ, త్రీ, ఫోర్ చక్రాలు కలిగిన వాహనాలున్నాయి. ప్రతి ఒక్కరిలో మార్పు వచ్చినట్లు గణాంకాలు చూస్తే తెలుస్తోంది. అందరూ లైసెన్స్ తీసుకుని వాహనం నడిపేందుకు ప్రాధాన్యత ఇస్తున్నారు. మూడేళ్లుగా 36,243 మంది లైసెన్స్ పొందారు. ట్రాఫిక్, రవాణాశాఖ నియమ, నిబంధనలను వాహనదారులు పాటించాలి. ప్రతి వాహనదారుడు లైసెన్స్ కలిగి ఉండాల్సిందే..

–వి.వెంకటరమణ, జిల్లా ఇన్‌చార్జ్ రవాణా శాఖ అధికారి

స్వచ్ఛంద సంస్థలు సహకరించాలి

భద్రాచలంటౌన్: భద్రాచల శ్రీసీతారామచంద్ర స్వామివారి కల్యాణం, పట్టాభిషేకం మహోత్సవాలకు వివిధ రాష్ట్రాల నుంచి వచ్చే భక్తులు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని రకాల సౌకర్యాలు కల్పించడానికి స్వచ్ఛంద సంస్థలు అధికారులతో సహకరించాలని భద్రాచలం ఆర్డీఓ దామోదర్‌రావు సూచించారు. శనివారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో స్వచ్ఛంద సంస్థలు, అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. భక్తులు ఎండ వేడిని సైతం లెక్కచేయకుండా కల్యాణం తిలకించేందుకు కుటుంబ సభ్యులతో వస్తారని, అందుకు ఆర్‌డబ్ల్యూఎస్, మిషన్ భగీరథ అధికారులు స్వచ్ఛమైన తాగునీరు, మజ్జిగ పాకెట్లు సరఫరా చేస్తున్నారని తెలిపారు. స్వచ్ఛంద సంస్థల సభ్యులు అధికారులకు సహకరించాలని, వలంటీర్లని నియమించి అందరికీ తాగునీరు, మజ్జిగ ప్యాకెట్లు అందించాలన్నారు. వలంటీర్లకు ప్రతి సెక్టార్‌కు వెళ్లడానికి గుర్తింపు కార్డులు అందిస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు శ్రీనివాస్, విజయలక్ష్మి, దామోదర్‌రావు, రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉచితంగా ఇసుక సరఫరా చేయాలి



ప్రదర్శన నిర్వహిస్తున్న నాయకులు

మణుగూరురూరల్: ఇసుక అక్రమ రవాణాను అడ్డుకోవడమే కాక ప్రజల అవసరాల కోసం ఉచితంగా సరఫరా చేయాలని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు డిమాండ్ చేశారు. బీఆర్‌ఎస్ ఆధ్వర్యాన మణుగూరులోని పార్టీ కార్యాలయం నుంచి అంబేడ్కర్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించాక ధర్నా చేశారు. కాంతారావు మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి ఇసుక అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపాలని సూచిస్తుంటే కాంగ్రెస్ నాయకులు మాత్రం యథేచ్ఛగా అక్రమ రవాణా చేస్తున్నారని ఆరోపించారు. ఇకనైనా చెక్‌పోస్టులను బలోపేతం చేసి అక్రమ రవాణాను అడ్డుకోవడమే కాక ప్రజల అవసరాలకు ఉచితంగా ఇసుక ఇవ్వాలని డిమాండ్ చేశారు. బీఆర్‌ఎస్ మండల, పట్టణ కన్వీనర్లు కుర్రి నాగేశ్వరరావు, కుంటా లక్ష్మణ్, నాయకులు పోశం నర్సింహారావు, వట్టం రాంబాబు, అడపా అప్పారావు, తాళ్లపల్లి యాదగిరిగౌడ్, ముద్దంగుల కృష్ణ, నర్సింహారావు, మునుకోటి ప్రమీల, రమాదేవి, చంద్రకళ రుద్ర వెంకట్, రవిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రూటు మార్చిన గంజాయి స్మగ్లర్లు..

- పడవల్లో తీసుకొచ్చిన 121 కిలోల గంజాయి పట్టివేత
- వివరాలు వెల్లడించిన పాల్వంచ డీఎస్పీ సతీశ్‌కుమార్



వివరాలను వెల్లడిస్తున్న డీఎస్పీ సతీశ్‌కుమార్

బూర్గంపాడు: భద్రాచలం బ్రిడ్జి చెక్‌పోస్ట్ వద్ద నిరంతరం పోలీసులు నిఘా పెట్టడంతో గంజాయి స్మగ్లర్లు రూటు మార్చారు. పడవలపై గోదావరిని దాటిస్తూ దూరప్రాంతాలకు గంజాయి రవాణా చేయటం మొదలెట్టారు. బూర్గంపాడుకు సమీపంలోని సమ్మక్క–సారలమ్మ గద్దెల వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్న క్రమంలో కారులో తరలిస్తున్న 121 కిలోల గంజాయిని పోలీసులు పట్టుకున్నారు. పాల్వంచ డీఎస్పీ సతీశ్‌కుమార్ శనివారం వివరాలు వెల్లడించారు. శనివారం బూర్గంపాడు వద్ద వాహనాలను తనిఖీ చేస్తున్న క్రమంలో కుక్కునూరు వైపు నుంచి వస్తున్న ఓ కారు పోలీసులను చూడగానే వెనుక్కి తిప్పే ప్రయత్నం చేశారు. అప్రమత్తమైన ఎస్‌ఐ రాజేశ్ కారును పట్టుకున్నారు. అందులో రూ.60.57 లక్షల విలువైన 121 కిలోల గంజాయి దొరికింది. కారును సీజ్ చేసి, కారులో ఉన్న సారపాక రాజీవ్‌నగర్‌కు చెందిన వాంకుడోత్ సాయికుమార్, కూనవరం మండలం పాలిపాక గ్రామానికి చెందిన పెడముత్యం వంశీని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఒడిశాలోని బలిమెలకు చెందిన భీమా వద్ద గంజాయి కొనుగోలు చేసి కారులో పాలిపాక తరలించారు. అక్కడి నుంచి నాటు పడవల్లో కుక్కునూరు మండలం వింజరం గ్రామానికి.. అక్కడి నుంచి కారులో తరలిస్తూ పట్టుబడ్డారని డీఎస్పీ వెల్లడించారు. ఈ అక్రమ రవాణాలో ఎస్కే మున్వర్, రమేశ్, కత్వాల సురేశ్, జగదీశ్, స్వరూప్, ఎల్లాజి, వాంకుడోత్ సురేశ్ భాగస్వాములుగా ఉన్నారని, వింజరం నుంచి కారులో గంజాయిని ఇల్లెందు క్రాస్‌రోడ్ వరకు తరలించి, అక్కడి నుంచి సోలాపూర్‌కు తరలించేందుకు ఏర్పాట్లు చేసుకున్నారని చెప్పారు. టేకులపల్లి మండలం బొమ్మనపల్లి గ్రామానికి చెందిన వాంకుడోత్ సురేశ్‌కుమార్ ప్రస్తుతం సోలాపూర్‌లో ఉంటూ గంజాయిని విక్రయించేందుకు పథకం వేసుకున్నారని, ఎస్కే మున్వర్, రమేశ్, కత్వాల సురేశ్, జగదీశ్, వాంకుడోత్ సాయికుమార్ గతంలో కూడా గంజాయి అక్రమ రవాణా చేస్తూ పోలీసులకు పట్టుబడ్డారన్నారు. ప్రస్తుతం ఇద్దరు నిందితులను అరెస్ట్ చేశామని, మరో ఏడుగురు పరారీలో ఉన్నారని డీఎస్పీ సతీశ్‌కుమార్ పేర్కొన్నారు. పాల్వంచ సీఐ సతీశ్, ఎస్‌ఐలు రాజేశ్, ప్రవీణ్, రామారావు, ట్రెయినీ ఎస్‌ఐ కేవ్‌సింగ్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీ వేణుగోపాలస్వామివారి సేవలో డీపీఓ



స్వామివారికి పట్టువస్త్రాలు తెస్తున్న డీపీఓ చంద్రమౌళి

జూలూరుపాడు: మండలంలోని కాకర్ల శ్రీ రుక్మిణీ సహిత సంతాన వేణుగోపాల స్వామివారిని శనివారం జిల్లా పంచాయతీ అధికారి చంద్రమౌళి దంపతులు దర్శించుకున్నారు. స్వామి, అమ్మవార్ల దర్శించుకుని పట్టు వస్త్రాలను సమర్పించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం డీపీఓ దంపతులను ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ ఢిల్లీ వెంకటేశ్వర్లు, పూజారి ఫణి రాజాచార్యులు, ఎంపీఓ తులసిరామ్, చెరుకుమల్లి కృష్ణయ్య, పొన్నెకంటి సతీష్ కుమార్, పంచాయతీ కార్యదర్శులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

బాధ్యతగా విధులు నిర్వర్తించాలి



మాట్లాడుతున్న ఎస్పీ రోహిత్‌రాజు

కొత్తగూడెంటౌన్: బ్లూకోల్ట్స్, పెట్రోలింగ్ సిబ్బంది బాధ్యతగా విధులు నిర్వర్తించాలని ఎస్పీ రోహిత్‌రాజు పేర్కొన్నారు. శనివారం జిల్లా వ్యాప్తంగా పోలీస్ స్టేషన్ల పరిధిలోని బ్లూకోల్ట్స్, పెట్రోలింగ్ సిబ్బందితో ఎస్పీ వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. పోలీస్ స్టేషన్ పరిధిలో రోడ్లపై సంచరిస్తూ, ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండాలని సూచించారు. డయల్–100కు ఫోన్ రాగానే వెంటనే ఘటనా స్థలానికి చేరుకోవాలని, బాధితులకు న్యాయం చేయడంతో బాధ్యతగా వ్యవహరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీసీఆర్బీ సీఐ శ్రీనివాస్, ఐటీ సెల్ ఇన్‌చార్జ్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

పట్టు రైతుల విజ్ఞాన యాత్ర



పట్టు రేరింగ్ షెడ్‌ను పరిశీలిస్తున్న రైతులు

ఖమ్మంవ్యవసాయం: పట్టు పరిశ్రమ శాఖ ఆధ్వర్యాన నిర్వహించిన విజ్ఞాన యాత్రలో ఉమ్మడి జిల్లాకు చెందిన 50 మంది పట్టు రైతులు పాల్గొన్నారు. రైతుల బృందం శనివారం రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండలం కోరింటకుంటలోని మల్బరీ తోటలు, పట్టు పురుగుల పెంపకం, రేరింగ్ షెడ్లను పరిశీలించింది. ఉమ్మడి జిల్లా పట్టు పరిశ్రమ ఉపసంచాలకులు ముత్యాల పర్యవేక్షణలో రైతులు ఈ యాత్రలో పాల్గొనగా, శాస్త్రవేత్తలు వినోద్‌కుమార్, రాఘవేంద్ర వారికి అవగాహన కల్పించారు. ముత్యాలు మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలో పట్టు పరిశ్రమ ఏర్పాటుకు వనరులు ఉన్నాయని, రైతులు ముందుకు రావాలన్నారు. సహాయ పట్టు పరిశ్రమ అధికారి దేవరాజు పాల్గొన్నారు.

కొత్త రైల్వేలైన్‌కు భూసేకరణ



మోటమర్రి వద్ద సర్వేలో రైల్వే, రెవెన్యూ అధికారులు

బోనకల్: బోనకల్ మండలం మోటమర్రి నుంచి జగ్గయ్యపేట వరకు నిర్మించే కొత్త రైల్వేలైన్ కోసం కేంద్ర ప్రభుత్వం ఇటీవల బడ్జెట్‌లో నిధులు కేటాయించింది. దీంతో మండలంలో ఆరు కిలోమీటర్ల లైన్ కోసం 53 ఎకరాల భూమి అవసరముండగా, మోటమర్రి వద్ద ఓవర్‌బ్రిడ్జి నిర్మాణానికి సైతం భూమి సేకరించాల్సి ఉంది. దీంతో రైల్వే సెక్షన్ ఇంజనీర్ రాజీవ్‌రంజన్, డీజీపీఎస్‌లు భారత్ షెకావత్, జితేందర్ గోస్వామి శనివారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు.

రెండు బైక్‌లు ఢీ..

మంటలు చెలరేగి ఇద్దరికి గాయాలు

మణుగూరుటౌన్: పట్టణంలో రెండు మోటార్ సైకిళ్లు ఢీకొనటడంతో పెట్రోల్ పైపులు ఊడిపోయి మంటలు చెలరేగి ఇద్దరికి గాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం.. పట్టణంలోని స్టేట్ బ్యాంక్ సమీపంలో రెండు బైక్‌లు ఢీకొన్నాయి. ఈ క్రమంలో పెట్రోల్ పైపులు ఊడిపోయి మంటలు చేలరేగాయి. సుందరయ్యనగర్‌కి చెందిన భుక్య సక్రాం, పగిడేరు గ్రామానికి చెందిన దోమల పవన్‌కు గాయాలయ్యాయి. క్షతగాత్రులను స్థానికులు 100 పడకల ఆస్పత్రికి తరలించారు.

బైక్ ఢీకొట్టిన ఘటనలో కేసు నమోదు

పాల్వంచరూరల్: స్కూటీపై వెళ్తున్న మహిళను మరో ద్విచక్ర వాహనం ఢీకొట్టింది. దీంతో మహిళ తీవ్రంగా గాయపడగా.. శనివారం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని పాండురంగాపురం సమీపంలోని తవిశలగూడెంలో వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్న ఎం.పుష్పలత ఈ నెల 20వ తేదీన స్కూటీపై పాల్వంచకు వెళ్తుండగా ఆదే సమయంలో తవిశలగూడెం వైపు ద్విచక్రవాహనంపై వస్తున్న చలిమల వేణు ఢీకొట్టాడు. పుష్పలతకు తీవ్రగాయాలు కాగా స్కూటీ ధ్వంసమైంది. ఆమెను 108 ద్వారా పాల్వంచలోని ఏరియా ఆస్పత్రికి.. అక్కడి నుంచి భద్రాచలంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పుష్పలత సోదరుడు చింతపల్లి విజయకుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్‌ఐ తెలిపారు.

గుట్కాప్యాకెట్ల పట్టివేత

భద్రాచలంఅర్బన్: పట్టణంలో అక్రమంగా నిల్వ ఉంచిన గుట్కా ప్యాకెట్లను శనివారం పట్టణ పోలీసులు పట్టుకున్నారు. పట్టణంలోని ఇందిరామార్కెట్‌లోని రాందేవ్ ఫ్యాన్సీ దుకాణం నిర్వాహకుడు మల్లిబేరరామ్.. ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచి భారీగా గుట్కాప్యాకెట్లు కొనుగోలు చేసి తన దుకాణంలో నిల్వ ఉంచాడు. ఇక్కడి నుంచి చిన్నచిన్న దుకాణాలకు రిటైల్‌గా విక్రయిస్తున్నాడు. విశ్వసనీయ సమాచారం మేరకు తనిఖీలు నిర్వహించగా పెద్ద మొత్తంలో గుట్కా ప్యాకెట్లు లభ్యమవ్వడంతో వాటిని స్వాధీనం చేసుకొని పోలీస్ స్టేషన్‌ను తరలించినట్లు పోలీసులు తెలిపారు. పట్టుబడిన గుట్కాప్యాకెట్ల విలువ రూ.1,76,100 అని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని టౌన్ ఎస్‌ఐ వెల్లడించారు.

నీటి గుంటలో జారిపడి బాలుడి మృతి



రాబిన్ మృతదేహం

వైరా: ప్రమాదవశాత్తు నీటి గుంటలో జారి పడిన బాలుడు మృతి చెందిన ఘటన వైరా మున్సిపాలిటీ పరిధి బీసీ కాలనీలో శనివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... బీసీ కాలనీకి చెందిన బిజ్జం బాలస్వామి – మేరీ దంపతుల కుమారుడు రాబిన్(9) స్నేహితులతో కలిసి వైరా రిజర్వాయర్ సమీపాన ఆడుకుంటున్నాడు. ఈక్రమంలో నీటి అంచునకు వెళ్లిన ఆయన ప్రమాదవశాత్తు అక్కడి గుంటలో జారి పడగా, ఈత రాకపోవడంతో నీట మునిగిపోయాడు. ఆయన స్నేహితులు ఇచ్చిన సమాచారంతో స్థానికులు, రాబిన్ తల్లిదండ్రులు చేరుకుని ఆయనను బయటకు తీసి ద్విచక్రవాహనంపై అస్పత్రికి తీసుకెళ్లేలోగా ఆయన బాలుడు మృతి చెందాడని వైద్యులు తెలిపారు. కాగా, బాలుడు బీసీ కాలనీ ప్రభుత్వ పాఠశాలలో నాలుగో తరగతి చదువుతుండగా, ఆయన సోదరి మణుగూరులోని గురుకులంలో పదో తరగతి చదువుతోంది. పాఠశాల నుంచి రాగానే ఆడుకోవడానికి వెళ్లిన రాబిన్ మృత్యువాత పడడంతో ఆయన తల్లిదండ్రులు, బంధువుల రోదనలు మిన్నంటాయి.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



వాంకుడోత్ కిషన్ మృతదేహం

ఇల్లెందురూరల్: మండలంలోని రాజీవ్‌నగర్‌తండా సమీపంలోని జెండాలవాగు వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వాంకుడోత్ కిషన్ (50) మృతి చెందాడు. మృతుని బంధువుల కథనం ప్రకారం.. మహబూబాబాద్ జిల్లా గార్ల మండలం చిన్న కిష్టాపురం గ్రామ పంచాయతీ దేశ్యాతండా గ్రామానికి చెందిన కిషన్ ఇల్లెందులో నివాసం ఉంటున్న తన కుమారుడిని చూసేందుకు భార్యతో కలిసి బైక్‌పై ఇల్లెందుకు బయలుదేరాడు. జెండాలవాగు వద్ద మహబూబాబాద్ నుంచి ఇల్లెందుకు వస్తున్న ట్రాలీ ఢీకొట్టడంతో కిషన్ అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలాన్ని సందర్శించి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

అగ్నిప్రమాదంతో సామగ్రి దగ్ధం



మంటల్లో కాలిపోయిన ఏసీ

అశ్వారావుపేటరూరల్: ఓ ఇంట్లో వెలిగించిన దీపం కిందపడి మంటలు వ్యాపించి, సామగ్రి దగ్ధమైన ఘటన శనివారం చోటుచేసుకుంది. బాధితుడు, స్థానికుల కథనం ప్రకారం.. అశ్వారావుపేటలోని కట్టా రామదాసు వీధిలో నివాసం ఉండే అరవి శ్రీను, భార్యతో కలిసి స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సెంటర్లో పండ్ల వ్యాపారం చేస్తుంటారు. ఇంట్లో దేవుడి చిత్రపటాల వద్ద దీపారాధన చేసి షాపు వద్దకు వెళ్లారు. దీపం కిందపడి మంటలు మంటలు వ్యాపించి ఏసీ, కూలర్, ఫ్యాన్లు, బీరువాతోపాటు వంట సామగ్రి కాలిపోయాయి. ఇంట్లో నుంచి దట్టమైన పొగలు రావడంతో గమనించిన చుట్టు పక్కలవారు అక్కడికి చేరుకొని అగ్నిమాపక శాఖ అధికారులకు సమాచారం అందించారు. రూ.2 లక్షల మేర నష్టం వాటిల్లిందని బాధితులు తెలిపారు.